క్లుప్తంగా

ఇంజినీర్లు సమాజ శ్రేయస్సును కాంక్షించాలి



ప్రత్తిపాడు: ఇంజినీర్లు సమాజ శ్రేయస్సును కాంక్షించాలని రిటైర్డ్ ఎస్ఈ పువ్వాడ వెంకటేశ్వరరావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ముందస్తుగా ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పువ్వాడ వెంకటేశ్వరరావు హాజరయ్యారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల కమిటీ చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులందరూ భావితరాలకు, సమాజానికి ఉపయోగపడేలా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డా.కె.హరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్



చేబ్రోలు: చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జాతీయ హిందీ భాషా దినోత్సవం(హిందీ దివస్) నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కే సుచరిత మాట్లాడుతూ హిందీ భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు. హిందీ అధ్యాపకులు కే సందేశ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

జీజీహెచ్‌లో అరుదైన గుండె ఆపరేషన్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ కార్డియోథొరాసిక్ సర్జరీ వైద్య విభాగం(సీటీవీఎస్)వైద్యులు అత్యంత అరుదైన గుండె ఆపరేషన్ చేసి ప్రాణాపాయ స్థితిలో చికిత్స కోసం వచ్చిన యువకుడి గుండెకు ఊపిరిపోశారు. అవనిగడ్డ నియోజకవర్గం కోడూరుకు చెందిన 25 ఏళ్ల శశికాంత్‌కు పదేళ్ల క్రితం గుండె ఆపరేషన్ జరిగింది. ఆ సమయంలో యువకుడి గుండె కొట్టుకునే వేగం తగ్గి స్పృహ కోల్పోయి పడిపోవటంతో గుండెను కృత్రిమంగా కొట్టుకునేలా పేస్‌మేకర్ అనే బ్యాటరీతో నడిచే పరికరాన్ని గుండెలో వైరు పెట్టి అమర్చారు. ప్రస్తుతం గుండెలో ఉన్న వైర్‌కు ఇన్‌ఫెక్షన్ సోకి రెండు నెలలుగా తీవ్రమైన చలిజ్వరంతో బాధపడుతున్నాడు. అన్ని ఆస్పత్రుల్లో చూపిన ఫలితం లేకుండా పోయింది. ప్రముఖ గుండె మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు, స్వహృదయ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే సూచనతో శశికాంత్ గుంటూరు జీజీహెచ్‌కు వారం రోజుల క్రితం వచ్చాడు. గుండె శస్త్రచికిత్స వైద్య నిపుణులు యువకుడికి పరీక్షలు చేసి గుండె కవాటాల్లో మధ్యలో ఉన్న వైర్‌ను తీసివేయటం ద్వారా తీవ్ర జ్వరం నియంత్రణలోకి వస్తుందని నిర్ధారించారు.

శుక్రవారం సీటీవీఎస్ వైద్యులు సుమారు మూడు గంటలసేపు కార్డియో పల్మనరీ బైపాస్ విత్ రైట్ అరిటోమా ఆపరేషన్ చేసి గుండె కవాటాల్లో ఇరుక్కున తీగవంటి లీడ్‌ను అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పేరం కుప్పుస్వామి తొలగించారు. వైర్ గుండె కవాటాల్లో ఉండటం వల్ల దెబ్బతిన్న కవాటాలను రిపేర్ చేసి గుండె సాధారణ వేగంతో కొట్టుకునేలా ఆపరేషన్ చేశారు. ఈ విషయాన్ని శనివారం మీడియాకు వెల్లడించారు. ఎంతో క్లిష్టమైన సుమారు ఏడు లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను పూర్తి ఉచితంగా చేసినట్లు సీటీవీఎస్ వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, గుండె శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ పేరం కుప్పుస్వామి తెలిపారు. డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణగోఖలే, డాక్టర్ కోనేరు సుధాకర్‌ల పర్యవేక్షణలో జరిగిన ఆపరేషన్ ప్రక్రియలో తనతోపాటుగా సీటీవీఎస్ విభాగాధిపతి హరికృష్ణమూర్తి, మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ పోలయ్య, అసోసియేట్ డాక్టర్ ఎమీమా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రమోదా, డాక్టర్ ఎస్.వి. రామరాజు పాల్గొన్నట్లు వెల్లడించారు.

శ్యామలకు గాయత్రీ సంగీత విద్వన్మణి బిరుదు ప్రదానం



నగరంపాలెం: కృషితో ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలు చేరవచ్చునని బండి శ్యామల నిరూపించారని ఏపీ జ్యూడీషియల్ అకాడమి డైరెక్టర్ అవధానం హరిహరనాథ్‌శర్మ అన్నారు. గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై శనివారం వీణా గాన సరస్వతి బండి శ్యామలకు 'గాయత్రీ సంగీత విద్వన్మణి బిరుదు ప్రదానం చేసి సత్కరించారు. ఏపీ హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్, న్యాయవాది బి.వసంతలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన హరిహరనాథ్ శర్మ మాట్లాడుతూ బండి శ్యామల ఎంచుకున్న కళా రంగంలో నిర్విరామంగా కృషి చేశారని అన్నారు. పలు సభల్లో వీణా వాయిద్య కచేరీలను నిర్వహించి ఈ స్థాయికి చేరారని పేర్కొన్నారు. సభలో నంబూరు చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ కొండా కోటిరెడ్డి, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య పాల్గొన్నారు.

పచ్చని చదువుల నెలవు..

- పదేళ్ల నాడు నాటిన మొక్కలు ప్రస్తుతం భారీ వృక్షాలు
- పచ్చదానంపై ఉపాధ్యాయుల ఆసక్తి
- మెరుగైన విద్యతో పాటు ఆహ్లాదకర వాతావరణం
- ఇదీ నిడుబ్రోలు జెడ్పీ ఉన్నత పాఠశాల



పచ్చదనంతో నిండిన నిడుబ్రోలు జెడ్పీ ఉన్నత పాఠశాల

పొన్నూరు: రోజులు మారాయి. గజం స్థలం దొరికిన భవనాలు వెలుస్తున్నాయి. గ్రామాల నుంచి పట్టణాల వరకు అదే పరిస్థితి. మొక్కలు పెంపకం కనుమరుగవుతోంది. కాలుష్యం నానాటికి పెరుగుతోంది. దీనివల్ల వాతావరణ సమతుల్యం దెబ్బతింటోంది. వేసవిలో ఎండలు మండుతున్నాయి. ఏడాదికి ఏడాది ఉష్ణోగ్రతలు మరింత అధికం అవుతున్నాయి. వర్షాకాలంలోనూ ఎండలు మండుతున్నాయి. ప్రతి ఏడాది వర్షాలు సక్రమంగా పడని పరిస్థితి ఎదురవుతోంది. స్వచ్ఛమైన గాలి లభించక వివిధ వ్యాధుల బారిన పడాల్సి వస్తోంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల నుంచి బయట పడాలంటే వీలున్న చోటల్లా పచ్చదనం పెంచాల్సి ఉంది. పదేళ్ల నాడు నాటిన మొక్కలు పెరిగి పెద్దవి కావటంతో ఎటు చూసినా పచ్చదనమే కనిపిస్తోంది. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పచ్చదనం పరిఢవిల్లుతోంది. సుమారు వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులు మొక్కలు నాటడంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వాటి సంరక్షణను ముందుకు తీసుకెళుతున్నారు. పాఠశాల ఆవరణ అనేక చెట్లకు నిలయంగా ఉంది.

ఆహ్లాదకర వాతావరణం



పచ్చదనంతోనే ప్రగతి సాధ్యమవుతుంది. మొక్కలను పెంచటం వల్ల మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చు. ఈ ప్రయోజనాలు తెలుసుకుని పచ్చదనం పెంపు, పరిరక్షణకు ముందడుగు వేయాలి. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించాలి. పాఠశాలలో పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాం. పిల్లలను ప్రోత్సహిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లల పుట్టిన రోజు నాడు ఒక మొక్క నాటిస్తే పచ్చదనం పరిరక్షణపై చిన్నారులకు అవగాహన కలుగుతోంది. –శివరామ్, ఉపాధ్యాయులు, జెడ్పీ పాఠశాల, నిడుబ్రోలు




పచ్చని చెట్ల నీడలో పాఠశాల ఆవరణ

లోక్ అదాలత్‌లో 89 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న న్యాయమూర్తి అంజనీ ప్రియదర్శిని

పొన్నూరు: పట్టణంలోని అడిషనల్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 89 కేసులు పరిష్కారం అయ్యాయని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎం.అంజనీ ప్రియదర్శిని తెలిపారు. సివిల్ కేసులు 11, క్రిమినల్ కేసులు 55, మనోవర్తి కేసులు 2, బ్యాంకు కేసులు 5, ఎస్టీ కేసులు 16 పరిష్కారం అయ్యాయని పేర్కొన్నారు. ఈ కేసులలో కక్షిదారులకు రూ.21,65, 328 పరిహారం కింద అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదాలత్ సభ్యులు మక్బుల్ బేగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.జయరాజ్, న్యాయవాదులు ఏఆర్‌కే సాయి, ఎంపీఆర్పీ ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

17న చేబ్రోలులో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చేబ్రోలు: యూటీఎఫ్ మండల శాఖ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీన ఏపీజే అబ్దుల్ కలాం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అవార్డుల ప్రదానం చేయనున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు వై.రమేష్‌బాబు తెలిపారు. కరపత్రాలను ఉపాధ్యాయ సంఘ నాయకులు శనివారం ఆవిష్కరించారు. లగడపాటి సీతారామయ్య ఎడ్యుకేషనల్ ట్రస్టు, చేబ్రోలు మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. చేబ్రోలు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 16 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి పొన్నూరు ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, రత్న శేఖర్‌బాబు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి చెక్కు అందజేత

నగరంపాలెం: గుంటూరు, కృష్ణా జిల్లాలోని వరద బాధితులకు గుంటూరు పోలీస్‌పరేడ్ గ్రౌండ్స్ సిటీ వాకర్స్ అసోసియేషన్ సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ. లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈమేరకు చెక్కును శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు అందించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వరద బాధితులకు అసోసియేషన్ తరఫున అందించిన సాయం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మినేని సీతారామయ్య, కార్యదర్శి నారదాసు కోటేశ్వరరావు, సభ్యులు ఏనుగుల రమణ, మధులాల్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, బండి పూర్ణచంద్రరావు, గోపిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై క్షేత్రస్థాయి అవగాహన



వరిలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: సేంద్రియ వ్యవసాయం ద్వారా పంటల ఆరోగ్యం కాపాడటంతో పాటు ఆరోగ్యకరమైన పంటలను పండించి మంచి ఆదాయం పొందవచ్చని లాం ఫాం కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ గంగాదేవి తెలిపారు. కేవీకే ఆధ్వర్యంలో గ్రామీణ సేంద్రియ వ్యవసాయం క్షేత్రస్థాయి అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. జొన్నలగడ్డలో వ్యవసాయ విద్యార్థులతో కలసి వరిలో సహజ వ్యవసాయ ఎరువులు జీవామృతం, ఘన–జీవామృతాన్ని పంటల్లో చలుకునే విధానాన్ని వివరించారు. సేంద్రియ వ్యవసాయం వలన వాతావరణ కాలుష్యం తగ్గుతుందని, భూమిలో స్థూల, సూక్ష్మ పోషకాలు, జీవన క్రియ పెరుగుతుందని పేర్కొన్నారు. ఆర్గానిక్ ఎరువుల వినియోగం వలన వరి పంట మంచి దుబ్బుకట్టి రైతులకు మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉత్తమ రైతు వంగ నవీన్‌రెడ్డి, వ్యవసాయ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఫార్మారంగంలో ప్రపంచదేశాలకు దీటుగా భారత్

- మంగళయాన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సాంబశివరావు
- ఐపీఏ నేషనల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టీవీ నారాయణ
- చిప్స్ కళాశాలలో ఘనంగా స్నాతకోత్సవం



విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం, అతిథులు

గుంటూరు రూరల్: ఫార్మారంగంలో భారతదేశం ప్రపంచ దేశాలకు దీటుగా ముందుకు సాగుతుందని జబల్‌పూర్ మంగళయాన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ఎస్ సాంబశివరావు తెలిపారు. శనివారం చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన స్నాతకోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు ఈ ఫార్మా గ్లోబల్ రంగంలో ఎన్నో అవకాశాలున్నాయని వాటిని అందిపుచ్చుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఫార్మారంగం అభివృద్ధికి ఎన్నో ప్రయోజనాలను ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఐపీఏ నేషనల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టీవీ నారాయణ మాట్లాడుతూ 21వ శతాబ్దంలో భారతదేశ ఫార్మా రంగం ప్రపంచంలోనే ముందడుగులో ఉందన్నారు. కోవిడ్ సమయంలో ఫార్మారంగంలో ఉన్న ఫార్మాసిస్టులు వారి కీలక ప్రాతను గురించి వివరించారు. టెక్నాలజీ ఎంతో ముఖ్యమైందని దానిని అందిపుచ్చుకోవటం, దాని ఆవశ్యకతను తెలుసుకోవటం విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర్ మాట్లాడుతూ కళాశాలలో జరిగిన వివిధ ప్లేస్‌మెంట్స్‌లో 98శాతం విద్యార్థులు వివిధ విభాగాల్లో ఉద్యోగాలను పొందారన్నారు. ప్లేస్‌మెంట్స్ సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. డిగ్రీ సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. అదే విధంగా కళాశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాల మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.5,000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ చుక్కపల్లి రమేష్, గద్దె మంగయ్య పాల్గొన్నారు.

మోతడకలో చలపతి నూతన ఫార్మసీ కళాశాల



నూతన కళాశాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: చలపతి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో తాడికొండ మండలం మోతడక గ్రామంలో చలపతి ఫార్మసీ నూతన కళాశాలను ప్రారంభించినట్లు చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాంలో చలపతి ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన నూతన కళాశాల బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోతడకలో చలపతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ నూతన కళాశాలను 2024–25 విద్యాసంవత్సరం నుంచి బీ ఫార్మసీ ప్రోగ్రామ్‌లో 100 మంది విద్యార్థులను చేర్చుకోవటానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ), రాష్ట్ర ప్రభుత్వం, విశ్వవిద్యాలయం నుంచి ఆమోదం లభించిందన్నారు. కళాశాల కౌన్సిలింగ్ కోడ్‌ను సీసీపీవైగా నిర్ధారించి కళాశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. చలపతి విద్యాసంస్థల సెక్రటరీ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ అన్ని రకాల సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు పాల్గొన్నారు.

గంగ ఒడికి గౌరీసుతుడు

అట్టహాసంగా నిమజ్జనం



నిమజ్జనానికి తరలుతున్న ప్రత్తిపాడు రెడ్డి యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు రెడ్డి యూత్ ఆధ్వర్యంలో స్థానిక రెడ్ల రామాలయం వద్ద కొలువుదీరిన గణనాథుడు నవరాత్రి ఉత్సవాలను ముగించుకుని శనివారం రాత్రి నిమజ్జనానికి తరలివెళ్లాడు. నింగినేలా మెరిసేలా.. గణనాథుడు మురిసేలా.. ప్రభా తబానుడు అస్తమిస్తున్న వేళ.. డీజేల మెరుపులు.. తీన్‌మార్ తళుకులు.. యువతీ, యువకుల కేరింతల నడుమ గణనాథుడు అంగరంగ వైభవంగా గంగ ఒడికి పయనమయ్యారు. నిమజ్జన వేడుకల్లో భక్తులు వందల సంఖ్యలో పాల్గొని వినాయకుడిని దర్శించుకున్నారు. ఇళ్ల ముంగిటకు వచ్చిన స్వామి వారికి మహిళలు వారులు పోసి హారతులిచ్చారు.

పోయింది అధికారమే.. నీపై అభిమానం కాదు

ఇదిలా ఉంటే యువత నిమజ్జన వేడుకల్లో ఉరిమే ఉత్సాహాన్ని ప్రదర్శించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఫొటోలతో పోయింది అధికారమే.. నీపై అభిమానం కాదంటూ.. డీజే డైలాగులతో హోరెత్తించారు. రెట్టించిన ఉత్సాహంతో యువతులు, యువకులు వైఎస్సార్ సీపీ రంగులతో రిబ్బన్లు గాలలోకి తిప్పుతూ కేరింతలు కొట్టారు. దారి పొడవునా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటోలకు క్షీరాభిషేకాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. కాగా తీన్‌మార్ తప్పెట్లు, దేవతా మూర్తుల వేషధారణలో మహిళలు ప్రదర్శించిన కళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

టెలికం నగర్‌లో..

గుంటూరు రూరల్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గంలోని 46వ డివిజన్ టెలికంనగర్ పరిధిలోని గణేషుని మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండపం కమిటీ సభ్యులు ఆయనను సాదరంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మండేపూడి పురుషోత్తం, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.



టెలికం నగర్‌లో వినాయకుని విగ్రహం వద్ద పూజల్లో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్

వడ్లమూడిలో..

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వినాయక విగ్రహాలు గ్రామోత్సవం అనంతరం శనివారం కోలాహలంగా నిమజ్జనాలు జరిగాయి. చేబ్రోలులోని కొమ్మమూరు ఛానల్ వద్ద, వడ్లమూడిలోని సంగంజాగర్లమూడి లాకుల వద్ద భక్తులు వినాయక విగ్రహాలను నిమజ్జనాలు నిర్వహించారు.

కాకుమాను మండలంలో..



గణనాథుడ్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

కాకుమాను: మండల కేంద్రం కాకుమానులో శ్రీ వీర్లంకమ్మ తల్లి దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణనాథుడ్ని శనివారం యూత్ సభ్యులు మేళతాళాలు, కనక తప్పెట్లతో నిమజ్జనానికి తరలించారు. ఏడు రోజులుగా చలువ పందిళ్లల్లో ఏర్పాటు చేసిన లంబోదరుడ్ని విశేషంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి గ్రామ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. విగ్రహ దాత కాకుమాను ఎంపీటీసీ–2 కానుగుల పరమేశ్వరరావు దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సంగం జాగర్లమూడి లాకుల వద్ద కొమ్మమూరు ఛానల్‌లో వినాయక నిమజ్జనం చేస్తున్న భక్తులు



ప్రత్తిపాడులో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటోలను ప్రదర్శిస్తూ కేరింతలు కొడుతున్న యుకులు



ప్రత్తిపాడులో యువతులు, మహిళల అదిరేటి స్టెప్పులు

ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: బీహెచ్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు శనివారం ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ బీవీ విజయభాస్కర్, కార్యదర్శి చేగు శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కౌసల్యాదేవి పాల్గొన్నారు.

• నరకయాతన



చేబ్రోలు మండలం వడ్లమూడి- గరువుపాలెం వద్ద అధ్వానంగా తెనాలి వెళ్లే ప్రధాన రహదారి



సంగం జాగర్లమూడి లాకుల వద్ద పెద్ద పెద్ద గోతులతో ప్రమాదభరితంగా ఉన్న రోడ్డు

చేబ్రోలు: రహదారులు.. వాహనదారులకు ప్రాణ సంకటంగా మారాయి. అందుకు ఉదాహరణే చేబ్రోలు మండలం వడ్లమూడి– గరువుపాలెం సమీపంలోని ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. గత కొన్ని నెలలుగా రోడ్డు పూర్తిగా దెబ్బతిన్ని గుంటల మయంగా మారింది. దీనికి తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకపోవటంతో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. శనివారం ఒక్క రోజే ఈ ప్రమాదకర గుంతల వద్ద ఐదుగురు వాహనదారులు గాయాలపాలవటంతో ప్రమాద తీవ్రతను తెలియజేస్తుంది.